## రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేదేన్నడో ?...


**నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్**

**ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, వాహనదారులు**



రుద్రూర్, బతుకమ్మ : రోడ్డు నిర్మాణ పనులు మూడు నెలలు గడుస్తున్నా ముందుకు సాగడం లేదనీ, దింతో రైతులు, వాహనదారులు తీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుద్రూర్ మండలంలోని రాణంపల్లి గ్రామ శివారు నుండి పంట పొలాలకు వెళ్లే మెటల్ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలతో గత మూడు నెలల క్రితం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు మెటల్ రోడ్డు నిర్మాణ పనులను మొదలు కూడా పెట్టలేదని, "రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేదేన్నడోనని" రైతులు వాపోతున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే పంట పొలాలకు వెళ్లే రైతులకు, వాహనదారులకు సులభంగా ఉంటుందని రైతులు పేర్కొన్నారు.

**కాంట్రాక్టర్ వివరణ :**



రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామంలో రూ.50 లక్షలతో చేపడుతున్న మెటల్ రోడ్డు నిర్మాణ పనులను ఇంకా ప్రారంభించలేదని, ఎప్పుడు మొదలు పెడుతారని కాంట్రాక్టర్ శ్రీకాంత్ కు చరవాణిలో వివరణ కోరగా, పైపులు ఆర్డర్ ఇచ్చామని, కల్వర్టులు వేశాక, రోడ్డు పనులు మొదలు పెడుతామని సమాధానమిచ్చారు. మెటల్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు కోరారు.

## అవినీతిరహిత మున్సిపల్ కార్పొరేషన్‌ను తీర్చిదిద్దడమే నా బాధ్యత

**60 డివిజన్లో బిజెపి అభ్యర్థులను గెలిపించి**

**అభివృద్ధి రహిత ఇందూరుగా మార్చుకోండి**

**నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ**



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :మన ఇందూరు.. మన మేయర్ నినాదంతో ప్రచారంలో ముందుకు వెళ్తున్న భారతీయ జనతా పార్టీ నీ ఈనెల 11న జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇందూరు ప్రజలు బిజెపి పార్టీకి మద్దతు పలికి ఓటు వేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. అలాగే అవినీతి రహిత నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను తీర్చిదిద్దడమే నా ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. 60 డివిజన్లలో భాజపా పార్టీ నుండి కార్పొరేటర్ గా పోటీ చేస్తున్న తమ అభ్యర్థులను ఇందూరు ప్రజలు తమ ఓటు అనే ఆయుధం ద్వారా కమలం పువ్వుకు ఓటు వేసి తమ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే కమిషన్లు కాంట్రాక్టర్లతో రియల్ ఎస్టేట్ ముసుగులో అర్బన్ నియోజకవర్గం లోని వేలాది కోట్ల రూపాయలు విలువచేసే భూములను అప్పటి ఎమ్మెల్యే తన అనుచరులు కబ్జా చేసి అక్రమ సంపాదన ధ్యేయంగా పెట్టుకున్నారని విమర్శించారు. ఇక రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలలో ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం తప్ప మిగతా ఏవీ కూడా చేయలేని అసమర్థత, 420 ప్రభుత్వమని విమర్శించారు. అలాగే 400 హామీలతో రాష్ట్రాన్ని మార్పు దశగా తీసుకువెళ్తామంటూ ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ సర్కార్ ఎలాంటి మార్పు చేయగానే అసమర్థత ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. అందుకే ఈ 11న జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మెజార్టీ స్థాయిలో బిజెపి అభ్యర్థులను గెలిపించి మున్సిపల్ కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగరవేద్దామని ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదన్నారు.

# ధన్‌పాల్ నీకు దమ్ముంటే ప్రెస్ క్లబ్ లో డిబేట్‌కి రా..

**రెండున్నర సంవత్సరాల కాలంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయని నీకు మాట్లాడే హక్కు లేదు**

**మాట్లాడే ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూడు**

**నీ చేతగానితనంతో నగరం అభివృద్ధికి నోచుకోలేక .. అంధకారంలోకి వెళ్ళింది.**

**నిజామాబాద్ మాజీ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల**

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నగరాన్ని అంధకారంలోకి తీసుకువచ్చారని, నాయకుడు అంటే నగర అభివృద్ధి చేసి ప్రజల అవసరాలను తీర్చే విధంగా ఉండాలని, నగరంలో చేసిన అభివృద్ధి పై ప్రెస్ క్లబ్ లో డిబేట్ పెడతా దమ్ముంటే రా.. డేట్ కుడా నువ్వే ఫిక్స్ చేసుకో.. అని నిజామాబాద్ మాజీ అర్బన్ శాసనసభ్యులు గణేష్ బిగాల అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్, బిజెపి నాయకులు నగర అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని, వారికి ఎలా ఓటు వేస్తారు ఒక సారి ఆలోచించండని ఆయనన్నారు. నా సొంత డబ్బులతో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులతో పాటు వధూవరులకు అన్నగా నేను బట్టలు పెట్టడం జరిగిందని, మరి ప్రస్తుత అర్బన్ ఎమ్మెల్యే కు 10 బట్టల దుకాణాలు ఉన్నాయి ఎవరికైనా బట్టలు పెట్టాడా అని, నీ ట్రస్టు ద్వారా నగర అభివృద్ధి చేస్తానని చెప్పావు, ఇప్పుడు ఎందుకు చేయడం లేదు, వ్యాపారాలు చేసుకోవడానికే ఎమ్మెల్యే అయ్యావా అని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ ఇచ్చిన నిధులతో 60 నుంచి 70 కార్యాలయాలు ఒకే వేదికపై ఉండే విధంగా నూతన కలెక్టరేట్ ను నిర్మించడం జరిగిందని, ఆనాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా నూతన మున్సిపల్ భవనాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని, ప్రజలు సేద తీర్చుకునేందుకు మినీ ట్యాంక్ బండ్ నిర్మించడం జరిగిందని, ఆర్మూర్ రోడ్, బోధన్ రోడ్, వర్ని రోడ్ నిర్మాణాలు చేసుకొని పూర్తి చేసుకున్నామని, సెంటర్ మీడియన్ పనులు చేసి విద్యుత్ అలంకరణతో సుందరీ కరణంగా చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. నిజామాబాద్ నగర జనాభాను అంచనా వేసి నీటి వసతి కల్పించడం జరిగిందని, బైపాస్ రోడ్డు పూర్తి చేసిన ఘనత కుడా బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. అలాగే రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసిందో చెప్పాలని అన్నారు. నగరంలో బిజెపి ఎమ్మెల్యే ఉన్నాడని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వద్దకు పంపించే పరిస్థితి ఏర్పడిందని, ఒక వేళ ఎమ్మెల్యే వద్దకు వెళ్తే నేను అధికారం లో లేను నాతో ఏం కాదంటున్నాడని ఎద్దేవా చేశారు. కళ్యాణ్ లక్ష్మి, షాది ముబారక్ తో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పిన ప్రభుత్వానికి, రూ. 2000 ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాని కంటే రూ.4000 రూపాయలు పెన్షన్ ఇస్తానని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేస్తారా అని ఆయనన్నారు. ధన్ పాల్ సూర్యనారాయణ గెలిస్తే ప్రభుత్వం ద్వారా నిధులు రాకపోతే నా ట్రస్టు ద్వారా అభివృద్ధి చేస్తానని చెప్పడం జరిగిందని, ఇప్పుడు నీ ట్రస్టు ఎటు పోయిందని, అభివృద్ధి చేయడానికి చేతకాదు కానీ, చేసిన వాళ్ల మీద నిందలు వేస్తావు అంటూ మండిపడారు. ధన్ పాల్ సూర్యనారాయణ మేయర్ నీ చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే గెలిచి మీరు చేసింది ఏమీ లేదు మేయర్ గా గెలిచి ఏమి చేస్తారు అని ప్రశ్నించారు. ప్రజలకు నువ్వు ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదని, బీజేపీ నాయకులు చేసిన అరాచకాల వల్ల ఒక కుటుంబం కృష్ణానదిలో, బాసరలో దూకి మరణించారని అన్నారు. పార్టీలకు అతీతంగా పనిచేసిన గొప్ప మనసు మాదని, అన్ని పార్టీలకు సమాన నిధులతో ఒకేలాగ పనిచేయడం




జరిగిందన్నారు. 2009 లో ఎంపీగా పోటీ చేస్తే ఆయన మీద నేను పోటీ చేసానని, కానీ మధు యాష్కి గౌడ్ ఒక్కరోజు కూడా నా గురించి మాట్లాడలేదని, లక్ష్మీనారాయణ పోటీ చేసిన నా గురించి మాట్లాడలేదని, ఎందుకంటే 50 సంవత్సరాల చరిత్ర తిరగరాసి అభివృద్ధి చేసినందుకే మాట్లాడలేదని ఆయనన్నారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేయడం జరిగిందని, మోడ్రన్ స్మశాన వాటికలు నిర్మించడం జరిగిందని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. మేము చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, ప్రజలందరూ బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ నగర మేయర్ దండు నీతు కిరణ్, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సుజాత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్, జగత్ రెడ్డి, డాక్టర్ రుషిత తదితరులు పాల్గొన్నారు.ఖ

# అభివృద్ధి కోసం... కాంగ్రెస్ కౌన్సిలర్లను గెలిపించాలి

## మాజీ డీసీసీబీ పోచారం భాస్కర్ రెడ్డి

బాన్సువాడ, బతుకమ్మ : బాన్సువాడ పట్టణం మరింత అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ తోనే సాధ్యమని మాజీ డిసిసిబి అధ్యక్షులు పోచారం భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ 30 ఏళ్ల క్రితం ఏవిధంగా ఉండే ,ఇప్పుడు ఏ విధంగా మారింది ఒక్కసారి ఆలోచించుకోండి అంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మొట్టమొదటిసారిగా ఒక సహకార సంఘం అధ్యక్షులుగా పనిచేసి తన స్వయం శక్తితో మంత్రిగా, శాసన సభాపతిగా ఎదిగారంటూ పోచారం భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. గులాబీ ప్రభుత్వంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి దమ్మున్న నేతగా ఉంటూ కేసీఆర్ను ఒప్పించి ప్రభుత్వ ఖజానా నుంచి కోట్లాది రూపాయలు తీసుకువచ్చి, బాన్సు వాడ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ వరకు చేసిన ఘనత కేవలం పోచారం శ్రీనివాస్ రెడ్డికే దక్కిందని పోచారం భాస్కర్ రెడ్డి గుర్తు చేశారు. బాన్సువాడ మన్సిపల్ ఎన్నికల సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డి సోమవారం పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. రెండు రోజుల క్రితం బాన్సువాడకు వచ్చిన కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను పోచారం భాస్కర్ రెడ్డి తీవ్రంగా తప్పు పట్టారు. సిరిసిల్ల అభివృద్ధికి కేటీఆర్ ఎన్ని ఎకరాలు అమ్మావు, ఇన్ని ఆస్తులు అమ్ముకొని సిరిసిల్ల అభివృద్ధి చేశావ అంటూ కేటీఆర్ ను ప్రశ్నించారు. మాట్లాడే ముందు ఒక పెద్ద మనిషి పోచారం శ్రీనివాస్ రెడ్డిని పట్టుకుని ఇష్ట రాజ్యాంగ మట్లాడడం సిగ్గు చేటుగా ఉందంటూ భాస్కర్ రెడ్డి తీవ్ర స్థాయిలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. తన తండ్రిపై ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే తనకు కోపం రాదా అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాలు ఉంటే కేవలం బాన్సువాడ నియోజకవర్గం తెలంగాణ లోనే అభివృద్ధిలో ముందుగా నిలబెట్టడానికి కారకులు పోచారం శ్రీనివాస్ రెడ్డి కాదా దమ్మున్న నాయకుడిగా పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు రాబట్టి బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగంలో అభివృద్ధి చేసిన ఘనత పోచారంకి దక్కిందని పోచారం భాస్కర్ రెడ్డి వెల్లడించారు. మూడు దశాబ్దాల కాలంగా బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాతినిధ్యం వహిస్తూ ఒకవైపు అభివృద్ధి పనులు, మరొకవైపు సంక్షేమ పథకాలను చేపడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే బాన్సువాడ మొదటి స్థానంలో నిలిపిన ఘనత పోచారం శ్రీనివాస్ రెడ్డి దే అని పోచారం భాస్కర్ రెడ్డి గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని విమర్శించడం ఎంతవరకు సమంజసం అంటూ కేటీఆర్ వ్యాఖ్యలపై భాస్కర్ రెడ్డి మండిపడ్డారు. నిరుపేదలకు వైద్యం, విద్యార్థులకు నాణ్యమైన



విద్య, వ్యవసాయ రంగానికి కావలసిన రిజర్వాయర్లు, ఇంటిగ్రేటెడ్ సమీకృత పాఠశాలలు, గురుకుల పాఠశాలలో, వసతి గృహాలు, నిరుపేదల మహిళలకు అందుబాటులో మాత శిశు ఆరోగ్య కేంద్రం, ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పనులు చేపట్టి ప్రజల్లో ఒక గుర్తింపు నాయకుడిగా పోచారం శ్రీనివాస్ రెడ్డిని బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు శీనన్నగా పిలుస్తున్నారంటే ఆయన చేసింది అభివృద్ధి ఏమిటో ఒక్కసారి తెలుసుకో కేటీఆర్ అంటూ పోచారం భాస్కర్ రెడ్డి సవాల్ విసిరారు. తన తండ్రి చేసిన అభివృద్ధిపై ఎక్కడైనా ఎప్పుడైనా ఏ రోజైనా తాను పూర్తి వివరాలుతో వెల్లడించడానికి సిద్ధంగా ఉన్నానని పోచారం భాస్కర్ రెడ్డి సవాల్ చేశారు. ఎవరికి అందనంత ఎత్తుగా పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన పనులే ఆయనను ఆ స్థాయికి తీసుకువచ్చాయని పోచారం భాస్కర్ రెడ్డి గుర్తు చేశారు. తన తండ్రి పట్ల ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదే లేదంటూ భాస్కర్ రెడ్డి ఘాటుగా హెచ్చరించారు. బాన్సువాడ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగర వేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్ గా ఉంటే రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి బాన్సువాడను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని దీనిని గుర్తించి కాంగ్రెస్ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి అత్యధికంగా మెజార్టీతో గెలిపించాలంటూ పోచారం భాస్కర్ రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు.